క్లుప్తంగా

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల వితరణ



గోపాల్‌పేట: బుద్దారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థి రాఘవేంద్రరావు విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి వెళ్లేందుకు దోహద పడిన పాఠశాలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పాఠశాలకు ఎటువంటి సాయం చేసేందుకైనా తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ శ్రీదేవి, విష్ణు, పీఈటీ మధు, ఉపాధ్యాయులు శాంతన్న, జ్యోతి, మధుసూదన్, శాంతబాయి, హైమావతి, కురుమూర్తి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..



పాన్‌గల్: మండలంలోని మాదరావుపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ సుబ్బయ్యయాదవ్ తన సొంత డబ్బులతో తయారు చేసిన దుస్తులను సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, వారి సేవలకు గుర్తింపుగా దాతలు ముందుకొచ్చి తోడ్పాటు నందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు హలీమ్ పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి ప్రాధాన్యత లేదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో పార్టీకోసం పనిచేస్తున్న మైనార్టీలకు ప్రాధాన్యత లేదని కో ఆప్షన్ సభ్యుడు ఖాజా పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన కార్పొరేషన్ రుణాల్లో, ఉపాధిలో మైనార్టీలకు ప్రాధాన్యత లేదని పేర్కొన్నారు. మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి చెప్పినా, స్థానిక మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తమను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో తాము బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటామని పేర్కొన్నారు. మంత్రి ప్రస్తుతం అందుబాటులో లేరని, వచ్చిన తర్వాత సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నేడు జీవేశ్వరస్వామి జయంతి

ఆత్మకూర్: సాకులసాలి కులస్తుల ఆరాధ్య దైవం జీవేశ్వరస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జిందేదశరథ్‌రావ్, విఠల్‌రావ్, నాందేవ్‌చిల్లాల్, రవిశంకర్, జిందేమురళీ తెలిపారు. నేతాజీ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో జీవేశ్వరస్వామి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమం, అభిషేకం, భజన ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, కార్యక్రమంలో సాకుల సాలి సంఘం నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్‌లో నాయకుడే లేడు

పెబ్బేరు రూరల్: వనపర్తి కాంగ్రెస్ పార్టీ ఐక్యతారాగం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. సోమవారం ఆయన వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్‌లో ఎవరికి టికెట్ వస్తుందో తెలియదు, ఎవరు నాయకుడో తెలియని వారికి డిపాజిట్ కూడా రాదన్నారు. వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి లక్ష మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్: అనారోగ్యంతో మృతి చెందిన తెలుగు లక్ష్మయ్య కుటుంబానికి అంత్యక్రియల కోసం మాజీ వార్డు సభ్యుడు గద్దమీది శ్రీనివాసులు రూ.5వేలు ఆర్థిక సాయం అందించాడు. బాధిత కుటుంబానికి నగదు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు.

అబ్దుల్ కరీంసాబ్ ఉర్సుకు తరలిరండి

మదనాపురం: తాండూర్ పట్టణంలో జరిగే అబ్దుల్ కరీంసాబ్ ఉర్సుకు తరలి రావాలని దర్గా పీఠాధిపతి సాబేర్ పాషా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మదనాపురం మండలంలోని దుప్పల్లిలో ఆయన మాట్లాడుతూ తాండూర్ దర్గాలో ఈ నెల 30న గంధం, 31న దీపారాధన, వచ్చే నెల 1వ తేదీన పాతే దివ్యఖురాన్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నా రు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై విచారణ



సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై విచారణ చేస్తున్న సత్యనారాయణరెడ్డి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై అంబుడ్స్ పర్సన్ సత్యనారాయణరెడ్డి విచారణ చేపట్టారు. 2019 నుంచి 2022 వరకు మండలంలో చేపట్టిన ఉపాధి పనుల సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ సత్యనారాయణ, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు విచారించారు. కొన్ని మస్టర్లలో సంతకాలు లేకపోవడం, అధికంగా డబ్బులు చెల్లించడం, రికార్డులు సక్రమంగా రాయకపోవడం, తక్కువ డబ్బులు చెల్లించడం, ఒక్కో వ్యక్తికి 100 రోజులు పూర్తయినా అలాగే పనులు చేయించడం తదితర అభ్యంతరాలపై విచారణ చేశారు. విచారణకు సంబంధించి నివేదికను తయారు చేసి పైఅధికారులకు పంపిస్తామని వారు తెలిపారు.

కాంగ్రెస్ కమిటీల ఎంపికలో వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు మరోసారి బయటపడ్డాయి. సోమవారం మండల కేంద్రంలో పద్మశాలి కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ మండల కమిటీల ఎంపిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చిన్నారెడ్డి , పెద్ద మందడి ఎంపీపీ మోగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్‌లు హాజరయ్యారు. కమిటీ విషయంలో ముందుగా చిన్నారెడ్డి తనవర్గీయులతో ఒక దగ్గర, మెగారెడ్డి తన వర్గాయులతో మరో చోట కూర్చున్నారు. మండల కమిటీలో తనవర్గానికి చెందిన వ్యక్తులు ముగ్గురు పేర్లు చేర్చాలని మెగారెడ్డి కోరారు. అందుకు చిన్నారెడ్డి వర్గాయులు ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్యన కొంత వాగ్వాదం జరిగింది. చిన్నారెడ్డి తన వర్గీయులతో కూర్చొని పేర్లు రాస్తుండటంతో మెగారెడ్డి తన అనుచరులతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. తరువాత మాజీ మంత్రి కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రమేష్‌గౌడు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అశోక్‌రావు

అమరచింత: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి దివాన్‌జీ అశోక్‌రావు ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సోమవారం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం కట్టిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి, ఇప్పటి వరకు మూడు లక్షల ఇండ్లను కూడా కట్టించలేని స్థితిలో ఉన్నారన్నారు. సొంత స్థలమున్న వారికి గృహలక్ష్మి పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, అబ్దుల్, పలువురు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు

పాన్‌గల్: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీపీఓ రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంట, దావాజిపల్లిలో గ్రామీణ బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టేందుకు ముందస్తుగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శైలజ, సర్పంచులు వెంకటయ్యయాదవ్, అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారు



నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న మాణిక్‌రావ్‌ఠాక్రే

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సుస్థిరపాలన ప్రజలకు అందుతుందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేషం నాగరాజుగౌడ్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే, వ్యవహారాల ఇన్‌చార్జ్ రోహిత్‌చౌదరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామిలతో సమావేశమైనట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.4000 పెన్షన్, విద్యార్థినీలకు స్కూటీలు, ఇలా ఎన్నో పథకాలు ప్రజలకు అందిస్తామన్నారు.

కాంగ్రెస్ హయాంలో గ్రామాల అభివృద్ధి



బున్యాధిపురంలో కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని 'తిరుగబడదాం-తరిమికొడదాం' కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి, నియోజకవర్గ నేత మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సూగూర్, బున్యాధిపురం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రూ.500లకే సిలిండర్, దళిత, గిరిజనుల గృహ నిర్మాణానికి రూ.6లక్షలు, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. శంకర్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, రమేష్‌గౌడ్, బ్రహ్మంచారి, వెంకట్రాములు, రంజిత్‌కుమార్, సురేందర్‌గౌడ్, రాజ్‌కుమార్, చంద్రమౌళి, సర్వేష్, సాయిగౌడ్, మాజీ డైరెక్టర్ రాములు, గంధం అంజి, ఉమేష్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థపై బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

కొత్తకోట: రాష్ట్రంలో విద్యావ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, విద్యావ్యవస్థ పటిష్టం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్షకు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమంపై కాకుండా అక్రమార్జనపై దృష్టి పెట్టిందన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగులపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో అడుగుపెట్టినప్పటి నుండి ఆస్తులు సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టాడని, అభివృద్ధి శూన్యమన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్న నాయకులకు ఓట్లు వేస్తే ప్రజలు మోసపోతారని, ఓటు అనే వజ్రాయుధంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం దీక్షలో ఉన్న యూత్ కాంగ్రెస్ నాయకులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో మహేష్, అంజద్‌అలీ, బాలచందర్‌గౌడ్, అక్బర్, రాఘవేందర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, వడ్డె కృష్ణ, వెంకటేష్, శివ, రవిందర్‌రెడ్డి, గంగాధర్, నాగేంద్రబాబు, సాయన్నగౌడ్, జానకిరాములు, రాజు, అశోక్, బాలరాజు, జనార్దన్ పాల్గొన్నారు.

రైతుగోసకు తరలిన నాయకులు



అమరచింత: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన రైతుగోస కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక కార్యక్రమాలపై ఆందోళన చేయాల్సి అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండు లక్షల రుణమాఫీ ఇస్తామని, ధరణిని రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, హనుమంతు నాయక్, గట్టు భీమన్న పాల్గొన్నారు.

కుష్టుపై ఇంటింటి సర్వే



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కుష్టువ్యాధి గుర్తింపుపై ఇంటింటి సర్వే కొనసాగుతోంది. శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలుంటాయని, మచ్చలపై స్పర్శ లేకపోవడం, నొప్పి తెలియకపోవడం, పాదాలు, చేతులు, వేళ్లు తిమ్మిర్లు రావడం, చర్మం దళసరిగా ఉండటం, చర్మంపై నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కన్పించినప్పుడు కుష్టు వ్యాధిగా అనుమానించాలని వైద్య సిబ్బంది తెలిపారు. వ్యాధి లక్షణాలున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు



ఆత్మకూర్: మండలంలోని ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణికి అధికారులు గైర్హాజరయ్యారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తహసీల్దార్ మినహా అన్ని శాఖల అధికారులు డుమ్మ కొట్టారు. భూ సమస్యలు, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు ఫిర్యాదులు అందాయని, అధికారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ రాజు తెలిపారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల 23వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీ జబ్బార్ మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుత్ ప్రవేటీకరణకు నిరసనగా చలో అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు. అప్పటి ప్రభుత్వం ప్రజలపై గుర్రాలతో తొక్కించి, పోలీసులతో కాల్పులు చేయడంతో సీపీఎం కార్యకర్తలు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి, అమరులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, దేవేందర్, పరమేశ్వరాచారి, బాలస్వామి, మదన్, ఎన్ రాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడుకు చెందిన ఆశా కార్యకర్త జయమ్మ ఇటీవల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శ్రీనివాసులు సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: బీఆర్‌ఎస్ పాలనలోనే పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త వంగూరు ప్రమోదుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, మాణిక్యం, వెంకట్రావ్, రఘువర్ధన్‌రెడ్డి, ధర్మనాయక్, రవిప్రకాష్‌రెడ్డి, మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎత్తం రవి, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణనాయక్, చిట్యాల రాము, మహిళలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



వనపర్తి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న ఏఎన్‌ఎంలు

పెబ్బేరు రూరల్: రెండో ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరించే వరకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ, ఏఎన్‌ఎంల సంఘాల నేతలు ఉద్ఘాటించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో రెండో ఏఎన్‌ఎంల సమ్మె 13వ రోజుకు చేరింది. సోమవారం ఏఐటీయూసీ నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అక్కడి చేరుకొని వారిని శాంతింప చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అమరచింతలో నాగవిగ్రహానికి పూజలు చేస్తున్న జలేందర్‌రెడ్డి

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో బీజేపీ బలోపేతం కోసం నాయకులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జగన్‌వాడలో నూతనంగా ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీజేపీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నారాల నారాయణ, క్యామ భాస్కర్, సిద్దురాములు పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మిషన్‌భగీరథ అధికారులు

గోపాల్‌పేట: ఇటీవల రెగ్యులర్ అయిన వీఆర్‌ఏలను మిషన్ భగీరథ పథకంలో పనిచేసేందుకు కేటాయించిన వారికి సోమవారం మండల కేంద్రంలో నీటిశుద్ధిపై అవగాహన కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. కానాయపల్లిలో 37 మందికి ట్రైనింగ్ ఇచ్చామని, వారిని ఇప్పుడు ఫీల్డ్‌లోకి తీసుకొచ్చి వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించినట్లు మిషన్‌భగీరథ డీఈలు విజయ్‌కుమార్, అమిత్‌కుమార్ తెలిపారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, ఏఈలు మొగులయ్య, రవీందర్, దేవన్న ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు సన్మానం



సౌమ్యను సన్మానిస్తున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థులు సౌమ్య, ఎస్ కృషిధర్, ఎం.షాలేమురాజులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడంతో వారిని జేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అంబేడ్కర్ చిత్రపటాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ మాట్లాడుతూ వైద్యం అనేది ఒక వృత్తిగా కాకుండా మనుషులను బతికించే ఓ మహాశక్తిగా సేవ చేసే అవకాశం డాక్టర్ వృత్తిలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సుభాష్, చంద్రయ్య, విజయ్, మహిమరాజ్, కర్ణకుమార్, కల్యాణ్ ఉన్నారు.

'దళితబంధు'లో పారదర్శకత పాటించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న చెన్నరాములు

వనపర్తిటౌన్: నిరుపేద దళితులకు కాకుండా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకే దళితబంధు పథకం ఇస్తున్నారని, పథకం అమలులో పారదర్శకత పాటించకుంటే త్వరలోనే మంత్రి క్యాంపు కార్యాలయాన్ని దళితులతో కలిసి ముట్టడిస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందించినట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్ చెన్నరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి రెకమెండ్ చేసిన వారికే దళితబంధు అందుతుందని, నిరుపేదలకు అందడం లేదన్నారు. జిల్లా అధికారులపై మంత్రి నిరంజన్‌రెడ్డి పెత్తనం చెలాయిస్తూ, తన అనుచరగణానికి ఇప్పించే నిరంకుశ విధానం మానుకోవాలని హితవు పలికారు. దళితబంధు పథకంలో పారదర్శకత పాటించకుంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గద్దం మహేష్, కె. వెంకటేష్, సుభాష్ చంద్ర, రాజు, పీ నితిష్, సీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏవోకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

పెబ్బేరు రూరల్: 104లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం)ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏఓకు వినతిపత్రం సమర్పించారు. 15 ఏళ్లుగా 104 ఉద్యోగులు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ వేతనాలతో సేవలందిస్తున్నారన్నారు. వారిని క్రమబద్ధీకరించి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొబ్బిలి నిక్సన్, మనెమ్మ, ప్రశాంతి, జ్యోతి, శ్రీను, నందకిషోర్ పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమానికి కలిసి రావాలి

వీపనగండ్ల: మాదిగల ఏబీసీడీ వర్గీకరణ కోసం సమిష్టి ఉద్యమాలు నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ మంద నర్సింహ, కో కన్వీనర్ మీసాల నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం తూముకుంటలో ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ సాధన కోసం మాదిగజాతి బిడ్డలు ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా బోరెల్లి శేఖర్, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా స్వామి, సహాయ కార్యదర్శులుగా మౌలాలి, చిన్నమౌలాలి, అధికార ప్రతినిధిగా దావీదు, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గోపాల్‌పేట: పొలంలో పైపులను పగులగొట్టి, చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన పర్వతాలుకు తన పొలం పక్కనే ఉన్న బాల్‌రాజుతో కొంతకాలంగా గొడవలున్నాయి. ఆదివారం పర్వతాలు పొలంలో ఉన్న పైపులను బాలరాజు ధ్వంసం చేసి చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.